క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, చైతన్యపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాజీపేటలోని విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీసు స్టేషన్, డాక్టర్ వెంకట్ రెడ్డి ఆస్పత్రి, సాయి షాపూర్జ్ కాంప్లెక్స్, సోమిడి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్ నగర శివారులోని వసంతపూర్ ఫీడర్లో మరమ్మతు పనులు చేస్తున్నందున పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజనల్ ఇంజనీర్ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. వసంతపూర్, దూపకుంట ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు తూర్పు నాయీబ్రాహ్మణ ఎన్నికలు



నయీంనగర్: వరంగల్ నగర నాయీబ్రాహ్మణ సంఘం సేవా సంఘం అడ్హక్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నాయీబ్రాహ్మణ అధ్యక్ష ఎన్నికలు కాశిబుగ్గలోని లర్నర్స్ ల్యాండ్ హైస్కూల్ ఎదురుగా ఉన్న కాస్మో ఫంక్షన్ హాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరుగుతాయని కమిటీ సభ్యులు మేడిపల్లి దశరథం, కొడెపాక రాజేందర్, నాగరాజు, మధుసూదన్, వేణు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొదటిసారి బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరగనున్నట్లు వివరించారు.

11న యాంటీ ర్యాగింగ్పై అవగాహన

కేయూ క్యాంపస్: కేయూలో ఈనెల 11న క్యాంపస్లోని ఆడిటోరియంలో అవేర్నెస్ ప్రోగ్రామ్ యాన్ యాంటీ ర్యాగింగ్ అండ్ యాంటీ డ్రగ్స్పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

'అజర'లో ప్రత్యేక ఆఫర్లు



ఎంజీఎం: నగరంలోని అజర ఆస్పత్రి 5వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 9నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు అందించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ శివసుబ్రమణ్యం తెలిపారు. ఇందులో భాగంగా రూ.500లకు ల్యాబ్ పరీక్షలు, వైద్యుల కన్సల్టేషన్, రూ.6,999లకు గుండె, మధుమేహం, జనరల్ మెడిసిన్, నరాలు, ఇతర ప్రధాన వైద్య విభాగాలకు సంబంధించిన ప్రివెంటివ్ హెల్త్ చెకప్ అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అంబేడ్కర్ అవార్డు అందజేత



రామన్నపేట: ప్రతిష్ఠాత్మక బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నేషనల్ అవార్డును ఢిల్లీలో జరిగిన దళిత సాహిత్య అకాడమీ 40వ వార్షికోత్సవాల్లో నగరంలోని కొత్తవాడకు చెందిన చిప్ప వెంకటేశ్వర్లు అందుకున్నారు. ఈ మేరకు దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు ఎస్.సుమనాక్షర్, దక్షిణ రాష్ట్రాల ఇన్చార్జ్ జితేందర్ మను నుంచి అవార్డును స్వీకరించారు.

బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా ప్రతాపగిరి గోవర్ధన్



వరంగల్: తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా వరంగల్ ఎల్బీనగర్కు చెందిన ప్రతాపగిరి గోవర్ధన్ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్కుమార్ తెలిపారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు.

రాత్రి 10.30లకు హోటళ్లు, బార్లు మూసివేయాలి



మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లను రాత్రి 10.30 గంటలకు మూసివేయాలని యజమానులకు మడికొండ ఎస్హెచ్ఓ పులాల కిషన్ సూచించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు వారికి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నిర్దేశిత సమయంలోపు మూసివేయకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో?

- న్యూశాయంపేటలో ధ్వంసమైన అంతర్గత రోడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



ధ్వంసమైన రోడ్డు



గుంతలు పడిన రహదారి



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు, డ్రెయినేజీ

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేట గ్రామంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎప్పుడో నిర్మించిన సీసీ రోడ్లు ధ్వంసమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొన్ని కాలనీల్లో ఎన్నికల సందర్భంగా ఆర్భాటంగా రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఒక లేయర్తో మెటల్ రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రమాదాలకు నిలయంగా..

హనుమకొండ, కాజీపేట, వరంగల్ మీదుగా వివిధ అవసరాల నిమిత్తం నగరవాసులతో పాటు న్యూశాయంపేట ప్రజలు న్యూశాయంపేటను ఆనుకుని ఉన్న రహదారిపై ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఈక్రమంలో శిథిలావస్థకు చేరుకున్న సీసీ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి లింగయ్య



ధర్నా చేస్తున్న జీఎంపీఎస్ నాయకులు

హన్మకొండ అర్బన్: గొర్రెలు, మేకల పెంపకందారులు, కాపర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లింగయ్య డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన సంఘం నాయకులతో కలిసి హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రజావాణిలో అధికారులకు అందజేశారు. అనంతరం లింగయ్య మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కావాల్సిన నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, అవినీతి సాకుతో రెండవ విడత గొర్రెల పంపిణీ చేయకుండా రెండేళ్ల తర్వాత డీడీలు వాపస్ ఇచ్చిందని, దీంతో గొల్లకురుమలు ఆర్థికంగా నష్టపోయారని వాపోయారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల రమేష్, సహాయ కార్యదర్శి పోటు రాజకుమార్, జిల్లా కమిటీ సభ్యులు గంద్రకోటి కుమార్, నల్లబట్ల చిన్నరాజు, తొట్టి భీమన్న, బెల్లం ప్రేమ్కుమార్, కొడాలి నర్సయ్య, రమేష్, నారాయణ, పవన్, రాజు పాల్గొన్నారు.

గొల్లకురుమల ధర్నాను జయప్రదం చేయండి



ప్రజావాణిలో డీఆర్డీఓ కౌసల్యదేవికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

- జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్

వరంగల్: గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్తో ఈనెల 12న హైదరాబాద్లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ పిలుపునిచ్చారు. ఈమేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి బాలకృష్ణకు పలు డిమాండ్లతో వినతి పత్రాలను సోమవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే గొల్లకురుమల ఖాతాల్లోకి రూ.2లక్షలు నగదు బదిలీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మొఖం చాటేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సారంగం, జిల్లా కమిటీ సభ్యులు రాజు, జక్క రవి, తోట కుమార్, జక్క వెంకటేశ్వర్లు, కుక్కల సతీష్, పులిపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్భాస్కర్



ఢిల్లీలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హన్మకొండ / కాజీపేట: కాజీపేట రైల్వే సంబంధిత సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్భాస్కర్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేట సమస్యలపై కేంద్ర ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలతో కలిసి అనేక ఉద్యమాలు చేసి సాధించుకున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ విధి విధానాలను పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటించాలని కోరారు. కాజీపేట జంక్షన్ను డివిజన్గా ఏర్పాటు చేయాలని, స్ట్రీట్ వెండర్స్కు స్టేషన్ ఆవరణలో దుకాణ సముదాయాలు నిర్మించాలని, రైల్వే స్టేడియానికి బడ్జెట్ కేటాయించాలని, బోడగుట్ట వెళ్లే దారిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే 60 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్రావు, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, శిరుమల్ల దశరథం, దువ్వ కనకరాజ్, అఫ్జల్, కోండ్ర శంకర్, హుస్సేన్, సుంచు అశోక్, బరిగెల వినయ్, రాబర్ట్ జోసఫ్ పాల్గొన్నారు.

విద్యుత్కు అంతరాయం కలగొద్దు



దేశాయిపేట: 13వ డివిజన్లోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానిక కార్పొరేటర్ సురేష్కుమార్ జోషి కోరారు. దేశాయిపేటలోని విద్యుత్ సబ్స్టేషన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్ (పరిష్కార వేదిక)ను టీఎస్ఎన్పీడీసీఎల్ అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఏకశిలనగర్ రోడ్డుపై ఉన్న ట్రాన్స్ఫార్మర్ గద్దెను, జాలీలను తొలగించాలని, ఎస్సీవాడ చెరువుకట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయని, నవయుగకాలనీ, టీచర్స్ కాలనీ, ఎల్బీనగర్ జియా మసీదు వద్ద రోడ్డుపై నిరుపయోగంగా ఉన్న డీటీఆర్లను తీసివేయాలని, గణేష్నగర్, కేఆర్గార్డెన్స్లో పలు ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ లైన్లను తొలగించాలని లిఖిత పూర్వకంగా అధికారులను కోరారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఎస్వీ.వేణుగోపాలచారి, కె.రమేష్, ఆర్.చరందాస్, ఎం.రామారావులతో పాటు ఏఈ అజయ్, ఫోర్మెన్లు, లైన్మెన్లు, సిబ్బంది, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

చేపల విక్రయానికి షెడ్లు నిర్మించాలి



ధర్నా చేస్తున్న మత్స్యకారులు, నాయకులు

వరంగల్ అర్బన్: బాపూజీనగర్ రోడ్డులో చేపలు అమ్ముకుంటున్న చిరువ్యాపారులకు శాశ్వతంగా షెడ్లు నిర్మించి, కనీస సదుపాయాలు కల్పించాలని మత్స్యకార్మిక సంఘం నాయకులు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎంకేఎంకేఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ మాట్లాడుతూ కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్డు పక్కన 20 ఏళ్లుగా చేపలు అమ్ముకుంటూ సుమారు 30 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ ముదిరాజ్, కాజీపేట మండల కార్యదర్శి నీలం భానుచందర్, జిల్లా ఉపాధ్యక్షురాలు దువ్వ సమ్మక్క, రాజమణి, సునీత, వరలక్ష్మి, సంధ్య, సమ్మక్క, సమ్మక్క, చంద్రకళ, కమలమ్మ, రాధిక, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

స్వరాష్ట్ర సాధనకు పోరాడిన కేసీఆర్



తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హన్మకొండ: స్వరాష్ట్ర సాధనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు అలుపెరుగని పోరాటం చేశారని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విజయ్ దివస్ను సోమవారం జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విజయ్భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారని గుర్తుచేశారు. కేసీఆర్ నిరాహార దీక్ష, అమరుల త్యాగాలతో దిగివచ్చిన నాటి కేంద్ర ప్రభుత్వం.. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. అందుకే ఈ రోజు విజయ్ దివస్ జరుపుకుంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్ సోదా కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి



ధర్నా చేస్తున్న పీజీ మూడో సెమిస్టర్ విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 18నుంచి జరగనున్న పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్లోని పరిపాలన భవనం వద్ద సోమవారం బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఇంకా వివిధ విభాగాల్లోని కోర్సుల్లో సిలబస్ కూడా పూర్తి కాలేదని పేర్కొన్నారు. గ్రూప్స్, టెట్ పరీక్షలు సమీపించిన క్రమంలో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ అక్కడి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారమే మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

దివ్యాంగుల్లో సృజనాత్మకత పెంపునకు కృషి



చెక్కు అందజేస్తున్న గార్గి బిశ్వాస్

హన్మకొండ అర్బన్: మానసిక దివ్యాంగుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని కిసాన్ పరివార్ లిమిటెడ్ డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గార్గి బిశ్వాస్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. సంస్థ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ననావత్ భూపాల్ అందించిన రూ.లక్షవిలువగల చెక్కును మల్లికాంబ నిర్వాహకురాలు రామలీలకు అందజేశారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలిపొందిన చిన్నారులకు మెమొంటోలు, ప్రశంసపత్రాలు అందజేసి సన్మానించారు. అనంతరం పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు కోడం కల్యాణ్, పాముకుంట్ల శివరామ్, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ల్యాప్టాప్ అందజేత



వెంకటేష్కు ల్యాప్టాప్ అందజేస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: ఉన్నత విద్యలో రాణించేందుకు పేదరికంతో ఇబ్బంది పడుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి బానోతు వెంకటేష్కు భారత వికాస్ పరిషత్ (బీవీపీ) వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ల్యాప్టాప్ను సోమవారం ఉచితం అందజేశారు. ఈమేరకు హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో పేరెంట్స్, టీచర్ మీటింగ్లో కళాశాల పూర్వ విద్యార్థి వెంకటేష్కు ల్యాప్టాప్ను బహూకరించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఐఈఓ గోపాల్, బీవీపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు జైపాల్రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్కుమార్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, రాజశేఖర్రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పిల్లలకు బలవర్ధక ఆహారం ఇవ్వాలి

ఖిలా వరంగల్: అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే బలవర్ధకమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాలని కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ సూచించారు. వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలోని అంగన్వాడీ టీచర్ కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పిల్లలకు పోషణ స్థాయిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవాని, సుజిత, సులోచన, కవిత, ఆర్పీ జ్యోతి, జయశ్రీ,, శిరీష, ఆశ, ప్రమీద, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

వరంగల్: గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు సూచించారు. డివిజన్లోని ఎల్ఎంఎస్ఈ కమిటీ సమావేశంలో భాగంగా డివిజన్లోని అబ్బనికుంట అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు మడిపెల్లి జాషువా, కిన్నెర రవి, పోగుల కిశోర్, ఆశ కార్యకర్త జే.కోమల, అటెండర్ ఎస్.విజయ పాల్గొన్నారు.

విద్యార్థినులను రోజు కళాశాలకు పంపించాలి

హన్మకొండ: విద్యార్థినులను క్రమతప్పకుండా కళాశాలకు పంపించాలని తల్లిదండ్రులకు పింగిళి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవిత సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతివారం అధ్యాపకులను కలిసి తమ పిల్లల ప్రగతిని తెలుసుకోవాలని అన్నారు.

మధుమేహ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

విద్యారణ్యపురి: మధుమేహ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డయాబెటిస్ రివర్సల్, హృదయ సంబంధిత వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ గురుదత్త ఆనందమీనన్ సూచించారు. హనుమకొండలోని సామ జగన్మోహన్ స్మారక భవన్లో వరంగల్ మాధవబాగ్ క్లినిక్ ఆధ్వర్యంలో డయాబెటిస్ రోగులకు సదస్సు నిర్వహించారు. వైద్యులు సురేష్, గాయత్రి, ప్రభావతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకర్పై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించి బెదిరింపులకు పాల్పడిన షాద్నగర్ ఎమ్మెల్యే వి.శంకర్పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వెలమ కుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యం చేస్తూ సమాజంలో హింస చెలరేగే విధంగా బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. మధుసూదర్రావు, ప్రభాకర్రావు, శ్యాంసుందర్రావు, సోమేశ్వర్రావు, ప్రవీణ్కుమార్, స్వామిరావు, రవీందర్రావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఖిలా వరంగల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. వరంగల్ 40వ కరీమాబాద్ ఉర్సు ప్రతాప్నగర్లోని కురుమవాడలో వెన్నెల గాయత్రి మహిళా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో ఆకుతోట రజిత, గుడిమల్ల సుజాత అధ్యక్షతన సోమవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవి మాట్లాడుతూ రుణం పొందిన సభ్యులు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక సాధికారత సాధించాలని అన్నారు. సమావేశంలో కోరె కవిత, కుసుమ రజిత, గాయత్రి, కవిత, సుజాత, మంజుల పాల్గొన్నారు.

ఎంఎంనగర్లో ఉచిత వైద్యశిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ పరిధి ఎంఎంనగర్లో ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. బోగి సురేష్, సింగారపు ఏలియా, జగన్, రాజు, రవి, సంతోష్, సంధ్య, రమ, సాంబయ్య, సాంబరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ శివారులోని కడిపికొండ 46వ సర్వే నంబర్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తక్షణమే ఆపి, విచారణ జరిపించాలని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం కోరారు. ఈమేరకు ఆర్డీఓ రమేష్ రాథోడ్కు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఫిర్యాదు చేశారు.

కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాలనీలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకొని మహిళల కోసం ఉచితంగా కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యమడాల హనుకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎలుక సుగుణ, మునిగాల విలయం, యశోద, రాధ, సరిత, జాన్సీ, సుష్మ, సుగుణ, ప్రమీల పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ల అరెస్ట్.. విడుదల

హసన్పర్తి: హసన్పర్తి మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్లు అసెంబ్లీ ముట్టడికి సోమవారం పిలుపునిచ్చారు. ఈమేరకు శరత్, రాణి, పెద్ది మల్లారెడ్డి, ఐలయ్య, సాంబారెడ్డిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్స్టేషన్కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కాజీపేట: కాజీపేట పట్టణంలో నాలుగు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. జఫర్గఢ్ మండలం కూనూర్ ఆకేరు వాగు నుంచి విచ్చలవిడిగా ట్రాక్టర్లలో ఇసుకను పట్టణానికి తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తరలింపు వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నట్లుగా జిల్లా అధికారులకు ఇటీవలి కాలంలో వరుసగా ఫిర్యాదులు అందాయి. దాంతో పోలీసులు రంగంలోకి దిగి ఇసుకను ఆకేరు వాగు నుంచి పట్టణానికి రవాణా చేస్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. వ్యాపారులపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పరీక్షల నియంత్రణాధికారికి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కట్ల రాజేందర్ను దూరవిద్య కేంద్రం సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకట గోపినాథ్, అధ్యాపకులు డాక్టర్ మాదాసి కనకయ్య, డాక్టర్ అలకంటి సునీత, డాక్టర్ సాయిశరణ్, డాక్టర్ మయూరి, శ్రీవాస్తవ సోమవారం సన్మానించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ శ్రీరామ్నగర్ కాలనీలో రిటైర్డ్ టీచర్ నాగపూరి లక్ష్మీనారాయణ, దున్నాల శ్రీనివాస్రావు ఇటీవల మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్రావు సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో కర్నె రవీందర్, అర్జున్ గౌడ్, గోపి, తదితరులు ఉన్నారు.

మంత్రి సురేఖ రాజీనామా చేయాలి

వరంగల్: కాంగ్రెస్ కార్యకర్తకు తన సిఫార్సు లెటర్తో వేములవాడ ఆలయంలో ఉన్న గోవులను ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చిన మంత్రి కొండా సురేఖ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాశిబుగ్గలో బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు సముద్రాల పరమేశ్వర్, బైరి మురళీకృష్ణ, రఘునరెడ్డి, మార్టిన్ లూథర్, గోవింద్సింగ్, మాదాసు రాజు, కోమాకుల నాగరాజు, ప్రభాకర్, శ్రీనివాస్, కోట సతీష్, చిమ్మని శ్రీకాంత్, గాదె భిక్షపతి, అల్లి అజయ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ కుమారస్వామికి మాతృవియోగం

రామన్నపేట: 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి మాతృమూర్తి బస్వరాజు సరోజన (67) సోమవారం మృతి చెందారు. ఈమేరకు కార్పొరేటర్ను మంత్రి సురేఖ ఫోన్లో పరామర్శించగా, మేయర్ సుధారాణి ఓదార్చారు.

మాకు రక్షణ కల్పించాలి

ఖిలా వరంగల్: వరంగల్ జక్కలొద్ది గుడిసెవాసులకు సీపీఎం రక్షణగా నిలవాలని పేదలు కోరారు. ఈమేరకు సీపీఎం నేత మాలోతు సాగర్ను కోరారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నగర వ్యాప్తంగా పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, కేక్లు కట్ చేశారు. సోనియా దయతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందని గుర్తుచేశారు.

- సాక్షి నెట్వర్క్



వరంగల్: సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ చేస్తున్న పార్టీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు



జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల లీగల్ సెల్ చైర్మన్లు



కేక్ కట్చేస్తున్న మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ